### కాంగ్రెస్ పార్టీ గెలిస్తే మళ్లీ


# దళారుల రాజ్యం

- దళితబంధు, రైతుబంధును కాంగ్రెసోళ్లు ఆపేస్తరు..
- కరెంట్ కష్టాలు మొదలైతయ్..
- గడియారాలు తీసుకుని బతుకులు బలిపెట్టొద్దు
- సత్తుపల్లి ప్రజాఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి కేసీఆర్

ఖమ్మం, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే దళారుల రాజ్యం మళ్లీ వస్తుందని బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. ఖమ్మం జిల్లాలోని కల్లూరు మండల కేంద్రంలో బుధవారం సత్తుపల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య అధ్యక్షతన నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ వస్తే దళితబంధు, రైతుబంధు వంటి పథకాలను నిలిపేస్తారన్నారు. రాష్ట్రంలో కరెంట్ బంద్ అవుతుందన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థులను అసెంబ్లీ గేటు తాకనివ్వమని కాంగ్రెస్ పార్టీ నేతలు అవాకులు చెవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ అభ్యర్థులకు ప్రజలు అఖండ విజయాన్ని కట్టబెడతారన్నారు. పోరాటం చేసి తాను తెలంగాణ తెచ్చినా, తానెప్పుడూ ప్రజలను తక్కువ చేసి మాట్లాడలేదన్నారు. అహంకారపూరితంగా ఒక్క వ్యాఖ్య కూడా చేయలేదన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ నేతలు నాలుగు పైసలు జేబులోకి రాగానే ధన మదంతో బీఆర్ఎస్‌కు సవాళ్లు విసురుతున్నారని ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్యయుతంగా కాకుండా ధన బలంతో ఏమైనా చేయెచ్చని అనుకునే వారికి ప్రజలు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. కూరగాయలు కొనే సమయంలో పుచ్చులుంటే ఏరి వేసి మంచివి కొంటామని, మంచినీళ్ల కుండ కొనేటప్పుడు ఓటుపోయిందా? లేదా? అని పరిశీలిస్తామన్నారు. కానీ ఐదేళ్లు నియోజకవర్గ ప్రజలకు సేవ చేసే శాసనసభ్యుడిని ఎంపిక చేసుకునేటప్పుడు అన్ని విధాలా పరిశీలించి ఓటు వేయాలన్నారు. కొందరు స్వార్థపరులు ఇచ్చే రూ.60, రూ.70 విలువ చేసే గడియారాలకు సంతృప్తి చెంది బతుకులను తాకట్టు పెట్టుకోవద్దని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే సొంత భూములపై పరాయి పెత్తనం వస్తుందన్నారు. రైతుల భూములు పకడ్బందీగా ఉండాలనే తమ ప్రభుత్వం ‘ధరణి’ని అమలు చేస్తున్నదన్నారు. తాము అధికారంలోకి వస్తే ధరణిని రద్దు చేస్తామని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహూల్ గాంధీ వ్యాఖ్యానించడం సిగ్గుచేటు అన్నారు. రాహుల్‌గాంధీకి వ్యవసాయం అంటే ఏమిటో తెలియదన్నారు. ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్‌ను రాహుల్ చదువుతున్నారని ఎద్దేవా చేశారు.

### త్వరలో సీతారామప్రాజెక్ట్ పూర్తి చేయిస్తం..

గోదావరి జలాలను పాలేరుకు తరలించి ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో సీతారామ ప్రాజెక్టు నిర్మిస్తున్నామన్నారు. త్వరలో ప్రాజెక్ట్ పనులను పూర్తి చేయిస్తామన్నారు. నీటి వసతి లేక సాగర్ ఆయకట్టు ఎండిపోతున్న సమయంలో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సమస్యను తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. తాను చొరవ చూసుకుని నీటి విడుదలకు చర్యలు తీసుకున్నామని గుర్తుచేశారు. సీతారామా ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే ఖమ్మం జిల్లా ప్రజల సాగునీటి కష్టాలు తీరుతాయన్నారు.



### ప్రజల మనిషి సండ్ర..

ఎమ్మెల్యే వెంకట వీరయ్యపై సీఎం కేసీఆర్ ప్రశంసల వర్షం కురిపించారు. వెంకటవీరయ్య ప్రతి నిమిషం ప్రజల కోసం పరితపిస్తారని సీఎం అన్నారు. అవసరం ఎక్కడ ఉన్నా అక్కడ సండ్ర వాలిపోతారన్నారు. సండ్ర తనను కలిసిన ప్రతిసారీ సత్తుపల్లికి ఏదైనా చేయాలనే కోరతారన్నారు.

### అర్హులందరికీ దళితబంధు..

సత్తుపల్లి నియోజకవర్గంలో ప్రతి ఎస్సీ కుటుంబానికి దళితబంధు అందిస్తామన్నారు. సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ప్రాతినిథ్యం వహిస్తున్న మధిర నియోజకవర్గ పరిధిలోని చింతకాని మండలాన్ని దళితబంధు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి వందశాతం యూనిట్లు అందించామని గుర్తుచేశారు. తాను మాట్లాడింది సిరాక్షరమన్నారు. ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క మధిర నియోజకవర్గంలో దళితబంధు అమలు చేయాలని తనను కోరలేదన్నారు. ఎస్సీల కష్టాలను చూసి తాను దళితబంధు అమలు చేశానన్నారు.

### సేవాతత్పరుడు బండి పార్థసారథిరెడ్డి..

రాజకీయాల్లో బండి పార్థసారథిరెడ్డి వంటి పారిశ్రామికవేత్త ఉండాలన్నారు. పార్థసారథిరెడ్డికి ప్రజలకు సేవ చేయాలనే తపన ఉందన్నారు. ఆయన తనను ఏమీ అడగలేదన్నారు. తానే స్వయంగా రాజకీయాల్లోకి ఆహ్వానించి రాజ్యసభ సభ్యుడిని చేశానన్నారు.

### మోదీ పాలనలో అన్నీ ప్రైవేటు పరం..

ప్రధాని మోదీ అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తున్నారని సీఎం కేసీఆర్ మండిపడ్డారు. అలాగే వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెట్టాలని తనపై వత్తిడి తెచ్చారని, కానీ తాను బతికి ఉన్నంతవరకు మీటర్లు బిగించనని ఖరాఖండిగా తేల్చి చెప్పానన్నారు. ఫలితంగా కేంద్రం నుంచి తెలంగాణకు రావాల్సిన రూ.25 వేల కోట్లను నిలిచిపోయాయన్నారు. అయి నా తాను వెనక్కి తగ్గలేదన్నారు. సభలో రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీ నామా నాగేశ్వరరా వు, రాజ్యసభసభ్యుడు బండి పార్థసారథిరెడ్డి, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, తాతా మధు, ఎమ్మెల్యేలు రాములునాయ క్, మెచ్చా నాగేశ్వరరావు, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావు, జీహెచ్ఎంసీ మాజీ నగర మేయర్ బొంతు రామ్మోహన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేశ్, బీఆర్ఎస్ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చింతనిప్పు కృష్ణ చైతన్య పాల్గొన్నారు.

## సంక్షేమరాజ్య సృష్టికర్త సీఎం కేసీఆర్: ఎమ్మెల్యే సండ్ర

ముఖ్యమంత్రి కేసీఆర్ సంక్షేమ రాజ్య సృష్టికర్తగా ప్రజల మనసుల్లో నిలిచిపోతారని సత్తుపల్లి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేస్తున్నారని గర్తుచేశారు. ఖమ్మం జిల్లా కల్లూరులో బుధవారం ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడారు. ఈ నెల 30న జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీర్వాదంతో బీఆర్ఎస్ అభ్యర్థిగా తాను బరిలో ఉన్నానని అన్నారు. 15 ఏళ్లుగా ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేస్తూ మూడుసార్లు సత్తుపల్లి ఎమ్మెల్యేగా గెలిచి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని అన్నారు. సీఎం కేసీఆర్ సహకారంతో రూ.1,000 కోట్ల నిధులు తెచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఎంత అభివృద్ధి జరిగిందే ప్రజల కళ్లముందే ఉందన్నారు. రాష్ట్ర సరిహద్దులో ఉన్న నియోజకవర్గ ప్రజలంతా పొరుగు రాష్ట్ర అభివృద్ధిని, మన రాష్ట్ర అభివృద్ధిని బేరీజు వేసుకోవాలని సూచించారు. సాగునీరు, తాగునీరు, విద్యుత్, రహదారుల విషయంలో ఆంధ్రా ప్రజలు అసూయ పడేలా అభివృద్ధి చేశామని వివరించారు. దళితబంధు పథకంలో ఎస్సీల ఆర్థిక స్థితిగతులను మార్చిన ఘనత సీఎం కేసీఆర్ దక్కిందని స్పష్టం చేశారు. సత్తుపల్లి నియోజకవర్గంలోని ప్రతి ఎస్సీ కుటుంబానికి దళితబంధు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం జీవో సైతం జారీ చేసిందని గుర్తుచేశారు. నియోజకవర్గంలో 30 వేల ఎస్సీ కుటుంబాలకు దళితబంధు ఇచ్చేందుకు సర్వే కూడా పూర్తయిందన్నారు. అడుగడుగునా ఉన్న అభివృద్ధి ముద్రలు ప్రతిపక్షాలకు కనబడడంలేదా? అని ప్రశ్నించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీ గేటు తాకనివ్వబోమంటూ కొందరు కాంగ్రెస్ నేతలు ప్రగల్బాలు పలుకుతున్నారని విమర్శించారు. కానీ ప్రజలు బీఆర్ఎస్ వైపే ఉన్నారన్న విషయాన్ని ఓటు ద్వారా రుజువు చేయాలని పిలుపునిచ్చారు. మూడోసారి ముఖ్యమంత్రిగా కేసీఆర్‌ను, నాలుగోసారి ఎమ్మెల్యేగా తనను ఆదరించి ఆశీర్వదించాలని కోరారు.



# ఉద్యమాల పురిటిగడ్డ ‘ఇల్లెందు’

### నా బిడ్డ హరిప్రియను గెలిపించండి..
### పది హామీలిచ్చాం.. వంద పనులు చేశాం..
### ఇల్లెందు ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ) ఇల్లెందు నియోజకవర్గం ఉద్యమాల పురిటిగడ్డ అని ముఖ్యమంతి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పేర్కొన్నారు. ఇక్కడి నుంచి బీఆర్ఎస్ తరపున పోటీ చేస్తున్న తన బిడ్డలాంటి హరిప్రియను గెలిపించాలని పిలుపునిచ్చారు. ‘ఎన్నికలు వస్తాయి. పోతాయి. అవి జరిగేది ఖాయం. మిమ్మల్ని ఒకటే ప్రార్థిస్తున్నా. ప్రజలు ఇంకా పరిణితి చెందాలి. ఓటు వేసేటప్పుడు ఆలోచించాలి. మంచి ఆలోచనతో ఓటు వేస్తే మంచి పాలన మన దగ్గరకు వ స్తుంది. కేసీఆర్ చెప్పిన మాటల గురించి గ్రామాల్లో చర్చ పెట్టండి.’ అని అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం బొజ్జాయిగూడెంలో బుధవారం జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయ న మాట్లాడారు. మంచి ఎమ్మెల్యేను గెలిపిస్తే మంచి ప్రభుత్వం వస్తుందని అన్నారు. ఓటు మీచేతిలో ఉందని, ఆగం కావద్దని విజ్ఞప్తి చేశారు. సన్నాసులకు ఓట్లు వేయొద్దని సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏంచేసిందని కొంతమంది అంటున్నారని, మరి ఏం చేసిందో మీ అందరికీ తెలుసునని అన్నారు. పది హామీలిచ్చి వంద పనులు చేశామని గుర్తుచేశారు. రైతుబంధు, దళితబంధు, రైతుబీమా, మిషన్ భగీరథ వంటి పథకాలను చెప్పకుండానే చేశామని వివరించారు. కొత్తగా వచ్చిన రాష్ట్రాన్ని దారిలో పెట్టిన పార్టీ టీఆర్ఎస్ అని అన్నారు. తెలంగాణ ఏర్పడకముందు ఎన్నో బాధలు అనుభవించామని గుర్తుచేశారు. ఇప్పుడు మంచి పాలనలో వాటి నుంచి విముక్తి పొందామని అన్నారు. చీకటి రాత్రులు అనుభవించిన తెలంగాణలో 24 గంటల కరెంటు ఇచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.

### తలకాయ తెగిపడ్డా కరెంటు మోటర్లకు మీటర్ల పెట్టం

కరెంటుపై ప్రధాని మోదీ పిచ్చిమాటలు మాట్లాడుతున్నాడని సీఎం కేసీఆర్ విమర్శించారు. రైతుల వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టాలంటూ ఒత్తిడి తెస్తున్నారని అన్నారు. అది ఎంత వరకూ సమంజసమో మోదీయే చెప్పాలని ప్రశ్నించారు. అందుకే తన తలతెగిపడ్డా రైతుల మోటర్లకు మీటర్ల పెట్టనని స్పష్టం చేశానని అన్నారు. ఒకనాడు నీళ్లులేక బీళ్లుగా ఉన్న తెలంగాణలో ఇప్పుడిప్పుడే రైతులు ముఖాలు పచ్చగా కన్పిస్తున్నాయని అన్నారు. ఇలాంటి సమయంలో రైతులకు రైతుబంధు ఇచ్చి ఆదుకున్నానని గుర్తుచేశారు. అందుకే రాష్ట్రంలో 3 కోట్ల మిలియన్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చిందని వివరించారు. త్వరలో సీతారామ ప్రాజెక్టు పూర్తయితే మరో కోటి టన్నుల ధాన్యం దిగుబడి కూడా వస్తుందని అన్నారు.



### 45 వేల ఎకరాలకు పోడుపట్టాలు

ఎమ్మెల్యే హరిప్రియకు ఒక చరిత్ర ఉందని, ఈ నియోజకవర్గంలో 45 వేల ఎకరాలకు పోడుపట్టాలు ఇప్పించారని అన్నారు. విద్యావంతురాలు అయిన నా బిడ్డలాంటి హరిప్రియ.. ఇల్లెందును అన్ని విధాలా అభివృద్ధి చేశారని అన్నారు. ఈ ఎన్నికల్లో ఆమెను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. గతంలో భూమి ఉంటే పిల్లనిచ్చేవాళ్లు కాదని, ఇప్పుడు మీకెంత పొలముందని అడుగుతున్నారని అన్నారు. తెలంగాణ తెచ్చిన ఘనత ఇదేనని స్పష్టం చేశారు.

### అసెంబ్లీ గేట్లు తాకనిచ్చేది వాళ్లు కాదు.. మీరే..

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీ గేట్లు తాకనివ్వబోమంటూ కొంతమంది నాయకులు మాట్లాడుతున్నారని అన్నారు. కానీ అసెంబ్లీ గేట్లు తాకనిచ్చేది వాళ్లు కాదని, మీరేనని ప్రజలను ఉద్దేశించి అన్నారు. ఓట్లు వేసేది మీరని, భవిష్యత్ మీ చేతుల్లోనే ఉందని అన్నారు. అభివృద్ధిని చూసి ఓట్లు వెయ్యాలని అన్నారు. మళ్లీ మనమే గెలవబోతున్నామని, హరిప్రియ చెప్పిన విధంగా కొమరారాన్ని మండలం చేసుకుందామని అన్నారు. గెలిచాక మళ్లీ వచ్చి మీ మధ్యలోనే ఉండి మరోసారి మాట్లాడుకుందామని అన్నారు.

## పోడు పట్టాలిచ్చిన గొప్పనేత కేసీఆర్

### ఇల్లెందు సభలో బీఆర్ఎస్ అభ్యర్థి హరిప్రియ

ఇల్లెందు, నవంబర్ 1: ఏజెన్సీలో పోడు భూములకు పట్టాలిచ్చిన మహానేత సీఎం కేసీఆర్ అని ఇల్లెందు ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ అభ్యర్థి హరిప్రియానాయక్ పేర్కొన్నారు. గిరిజనులను పోడు భూములకు యజమానులను చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. మండలంలోని బొజ్జాయిగూడెంలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద సభలో ఆమె మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో ఇల్లెందు నియోజకవర్గంలో కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి పనులు జరిగాయని, సంక్షేమ పథకాలు అమలయ్యాయని అన్నారు. కేవలం అభివృద్ధి పనులకే రూ.3001 కోట్లు వెచ్చించినట్లు చెప్పారు. ఇల్లెందు వాసుల ఆరు దశాబ్దాల కల అయిన బస్ డిపోను కూడా ఏర్పాటు చేశారని, ప్రభుత్వ వైద్యశాలను 100 బెడ్ల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేశారని, డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. కేసీఆర్ పథకాలు అందని గడప లేదని స్పష్టం చేశారు. సీతారామ ప్రాజెక్టును సాధించి పెట్టిన కేసీఆర్‌కు నియోజకవర్గ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. పూర్తి ఏజెన్సీ ప్రాంతాలనైన కొమరారం, బోడులను మండలాలుగా, ఇల్లెందును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని కోరారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయకుండా కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మోసం చేస్తే.. ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ నోరు మెదపకుండా ఈ ప్రాంతానికి అన్యాయం చేసిందని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీర్వాదంతో మీ ఆడబిడ్డగా మీముందుకు వచ్చిన తనను నియోజకవర్గ ప్రజలు నిండు మనసుతో దీవించాలని కోరారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ స్పందిస్తూ.. ఎమ్మెల్యే హరిప్రియ తన బిడ్డలాంటిదని అన్నారు. వచ్చేది మన ప్రభుత్వమే గనుక.. ఆమె వివరించిన ప్రజా సమస్యలను వచ్చే ఏడాది మార్చి తర్వాత పరిష్కాస్తానని హామీ ఇస్తున్నానని అన్నారు. మంత్రులు పువ్వాడ అజయ్‌కుమార్, సత్యవతి రాథోడ్, ఎంపీలు నామా నాగేశ్వరరావు, మాలోత్ కవిత, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, జీహెచ్ఎంసీ మాజీ మేయర్ రామ్మోహన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, ఎమ్మెల్యేలు రేగా కాంతారావు, వనమా వెంకటేశ్వరరావు, మహబుబాబాద్ జడ్పీ చైర్మన్ బిందు, బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు కోనేరు చిన్ని, దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, జానీపాషా, రంగనాథ్, నాదేండ్ల శ్రీనివాస రెడ్డి, వరప్రసాద్, శీలం రమేశ్, హన్మంతరావు, తాతా గణేశ్, లక్ష్మణ్‌నాయక్, జేకే శ్రీను, కుంటా నవాబ్ పాల్గొన్నారు.

